సాక్షి కాకినాడ

బుధవారం | 23 | అక్టోబర్ | 2024



భవితకు పునాది

ఒక భవనాన్ని నిర్మించేటప్పుడు పునాది బలంగా వేయాలి. అప్పుడే ఆ పునాదిపై ఎన్ని అంతస్తుల నిర్మాణమైనా చేయవచ్చు. ఇదే విధానం విద్యాభ్యాసంలో విద్యార్థికి వర్తిస్తోంది.


8లో



కమనీయం.. బ్రహ్మోత్సవం

వాడపల్లిలోని శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామివారి బ్రహ్మోత్సవాలు మంగళవారం వైభవంగా కొనసాగాయి. మంత్రోచ్ఛారణ మధ్య భక్తజన కోటి తన్మయత్వంతో వేడుకలను తిలకించింది.

39వేల క్యూసెక్కుల మిగులు జలాలు విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి మంగళవారం సాయంత్రం 39,347 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. బ్యారేజ్ వద్ద నీటిమట్టం 10.90 అడుగులకు చేరింది. డెల్టా కాలువలకు 7,800 క్యూసెక్కులు విడుదల చేశారు.

న్యూస్‌రీల్

బాలాత్రిపుర సుందరి అమ్మవారికి రూ.9 లక్షల ఆదాయం



హుండీల ఆదాయాన్ని లెక్కిస్తున్న భక్తులు, సిబ్బంది

బోట్‌క్లబ్(కాకినాడ సిటీ): నగరంలోని సూర్యారావుపేటలో ఉన్న బాలాత్రిపుర సుందరి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయ హుండీలను మంగళవారం దేవదాయ, ధర్మాదాయ శాఖ కాకినాడ డివిజన్ ఇన్‌స్పెక్టర్ వడ్డి ఫణీంద్రకుమార్ సమక్షంలో లెక్కించారు. మొత్తం 40 రోజులకు రూ.9 లక్షల ఆదాయం వచ్చినట్టు ఆలయ ఈఓ ఉండవల్లి వీర్రాజు తెలిపారు. హుండీల లెక్కింపులో ఆలయ ప్రధాన అర్చకుడు చెరుకూరి సుబ్రహ్మణ్యం, ఉత్సవ కమిటీ చైర్మన్ గ్రంధి బాబ్జి, యూనియన్ బ్యాంకు సూర్యారావుపేట సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

జిల్లా టెలికం సలహా సంఘ సభ్యుడిగా సత్యనారాయణ



బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా టెలికం సలహా సంఘ సభ్యుడిగా ఎంఎస్ఆర్‌వీ సత్యనారాయణ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మంగళవారం విలేకర్లతో మాట్లాడుతూ, టెలికాం వినియోగదారుల సమస్యలు పరిష్కరించడానికి అధికారుల సమన్వయంతో కృషి చేస్తానన్నారు. ఈ పదవిలో నియమించిన డిప్యూటీ సీఎం, కాకినాడ ఎంపీకి కృతజ్ఞతలు తెలిపారు.

గట్టి నియామకం



కరప: మండలంలోని గురజనాపల్లి గ్రామానికి చెందిన గట్టి వెంకటేశ్వర రావు(రవి) ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా టెలికం సలహా సంఘ సభ్యుడిగా నియమితులయ్యారు. ఈ మేరకు న్యూఢిల్లీలోని బీఎస్ఎన్ఎల్ నుంచి ఉత్తర్వులు వచ్చినట్టు మంగళవారం ఆయన స్థానిక విలేకరులకు తెలిపారు. 2026 జూలై 13 వరకు పదవీ కాలం ఉంటుందన్నారు.

ఆర్టీసీలో దరఖాస్తుల ఆహ్వానం

కాకినాడ సిటీ: ఏపీఎస్ ఆర్టీసీలో అప్రెంటీస్‌షిప్‌కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు జిల్లా ప్రజా రవాణాధికారి ఎం.శ్రీనివాసరావు తెలిపారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని అమలాపురం, రాజమహేంద్రవరం, కాకినాడ డిపోల్లో డీజిల్ మెకానిక్, మోటార్ మెకానిక్, వెల్డర్లకు ఖాళీలున్నాయన్నారు. ఐటీఐ అభ్యర్థులు వెబ్‌సైట్ ద్వారా ఈ నెల 31లోగా డిపోల వారీగా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. విజయనగరంలోని వీటీ అగ్రహారంలో ఉన్న జోనల్ స్టాఫ్ ట్రెనింగ్ కాలేజీకి సర్టిఫికెట్ల పరిశీలనకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పు గోదావరి, కాకినాడ జిల్లాల అభ్యర్థులు నవంబర్ 8న హాజరు కావాలన్నారు.

అండకావరం

- ఎమ్మెల్యేల దన్నుతో 'లెక్క'లేని తనం
- రెచ్చిపోతున్న కూటమి నేతలు
- అరాచకాలు, వేధింపులు కోకొల్లలు
- ఒకే రోజు ఇద్దరు ఆత్మహత్యాయత్నాలు
- టీడీపీ, జనసేన నేతల దౌర్జన్యకాండ



ఆవు చేలో మేస్తుంటే, దూడ గట్టున మేస్తుందా.. అన్న సామెత చందాన కూటమి నేతలు రెచ్చిపోతున్నారు. గద్దె నెక్కిన దగ్గర నుంచి వారి అరాచకాలకు అడ్డూఅదుపూ లేకుండా పోయింది. మహిళలు, మహిళా ఉద్యోగులపై లైంగిక దాడులకు తెగబడటం మొదలు.. భూ కబ్జాలు, దౌర్జన్యాలకు అంతే లేకుండా పోతోంది. నియోజకవర్గ ఎమ్మెల్యేలు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, ద్వితీయ శ్రేణి నేతలు అధికారాన్ని అడ్డం పెట్టుకుని సాగిస్తున్న దోపిడీలు రోజురోజుకూ పెచ్చుమీరుతున్నాయి.

సాక్షి ప్రతినిధి, కాకినాడ: నలుగురికీ ఆదర్శంగా నిలవాల్సిన కూటమి ఎమ్మెల్యేలు దౌర్జన్యాలకు పాల్పడుతుంటే, వారి వెనుక తిరిగే నేతలు మాత్రం ఊరకనే ఉంటారా..! ఎమ్మెల్యేల కంటే నాలుగు ఆకులు ఎక్కువ చదివినట్టుగా పార్టీ ద్వితీయ శ్రేణి నేతలు.. దళితులు, మహిళలను కూడా చూడకుండా అరాచకాలకు పాల్పడుతున్నారు. ఇంత జరుగుతున్నా పోలీసు యంత్రాంగం నామ్ కే వాస్తే అన్నట్టు స్పందిస్తోందనే విమర్శలున్నాయి. ఇటీవల కాకినాడ రూరల్ జనసేన ఎమ్మెల్యే పంతం నానాజీ కాకినాడ రంగరాయ వైద్య కలాశాల పేథాలజీ హెచ్‌ఓడీ, ఆర్ఎంసీ స్పోర్ట్స్ గ్రౌండ్స్ ప్రెసిడెంట్ డాక్టర్ ఉమామహేశ్వరరావుపై దౌర్జన్యానికి పాల్పడ్డ సంఘటన రాష్ట్ర స్థాయిలో చర్చనీయాంశంగా మారిన సంగతి తెలిసిందే. ఆర్ఎంసీ మెడికోల కోసం ప్రత్యేకంగా కేటాయించిన ఆటస్థలంలో బయట వ్యక్తులు అనుమతి లేకుండా ఆటలాడేందుకు ఆరోజు డాక్టర్ ఉమామహేశ్వరరావు నిరాకరించడమే పెద్ద నేరం అన్నట్టు ఎమ్మెల్యే దౌర్జన్యానికి దిగడంపై జూనియర్ డాక్టర్లు, దళిత సంఘాల వారు ఆందోళన చేపట్టారు. దీంతో దిగొచ్చిన నానాజీ ప్రాయశ్చిత దీక్ష అనే రాజకీయ డ్రామాతో ముగింపు పలికారు. ఇప్పుడు ఎమ్మెల్యే బాటలో అతని ముఖ్య అనుచరుడైన జనసేన పార్టీ కరప మండల అధ్యక్షుడు బండారు మురళి, అతని అనుచరులు నానిబాబు, గుబ్బల భవానీ అదే మండలం పెనుగుదురు గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ పులపకూర సునీతను నెలవారీ మామూళ్ల కోసం ఒత్తిడి తీసుకువచ్చారు. అంతటితో ఆగకుండా మురళి తదితరులు లైంగిక వేధింపులతో మానసిక వేదనకు గురి చేశారు. దీంతో చివరకు ఆమె చేసేది లేక మంగళవారం ఆత్మహత్య యత్నానికి ఒడిగట్టింది. ఆమెను తొలగించి మరో మహిళను ఫీల్డ్ అసిస్టెంట్‌గా నియమించుకోవాలనేది జనసేన నేతల ప్లాన్. అలానే దొంగ మస్టర్లతో నెలవారీ రూ.20 వేల మామూళ్ల కోసం వారు ఆమెను వేధిస్తున్నారు. ఒక దశలో డబ్బులిస్తావా, లేక కోరిక తీరుస్తావా అంటూ నేతలు లైంగిక వేధింపులకు పాల్పడటం చర్చనీయాంశమైంది. లైంగిక వేధింపులపై సునీత భర్త వీరబాబు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయం ఎమ్మెల్యే నానాజీ దృష్టికి వెళ్లినా, తన అనుచరులు కావడంతో చూసీచూడనట్టుగా స్థానికులపై నెట్టేసి, చేతులు దులుపేసుకున్నారంటున్నారు. సకాలంలో ఎమ్మెల్యే నానాజీ స్పందించి.. నేతలపై చర్యలు తీసుకుని ఉంటే ఈరోజు సునీత ఈ ఘాతుకానికి పాల్పడే పరిస్థితి ఎదురయ్యేది కాదంటున్నారు. గత నెల 21న ఎమ్మెల్యే నానాజీ దౌర్జన్య ఘటనలో బాధితుడు దళిత వైద్యుడైతే, ఇప్పుడు అతని ముఖ్య అనుచరుడైన జనసేన అధ్యక్షుడు బండారు రవి లైంగిక వేధింపులతో ఆత్మహత్య యత్నానికి పాల్పడింది కూడా దళిత మహిళా ఉద్యోగే కావడం గమనార్హం.

తమ్ముళ్లేమీ తక్కువ కాదు

ఇలాంటి దౌర్జన్యాలు, దురాగతాలు జనసేన నేతలకే పరిమితం కావడం లేదు. ఈ విషయంలో జనసేన నేతలతో తెలుగు తమ్ముళ్లు పోటీ పడుతున్నారు. ఇటీవల కాకినాడ సంజయ్‌నగర్‌లో ఒక మద్యం షాపు ఏర్పాటు చేసే విషయంలో ఇక్కడి టీడీపీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు ముఖ్య అనుచరుడైన టీడీపీ నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు అనుచరగణం సాగించిన దౌర్జన్యకాండపై నగర ప్రజలు ముక్కున వేలేసుకున్నారు. తెలంగాణ రాష్ట్రం సికింద్రాబాద్ కుషాయిగుడాకు చెందిన జీవన్‌రెడ్డికి డ్రాలో హక్కులు పొంది, లీజుకు తీసుకున్న స్థలంలో మద్యం దుకాణం ఏర్పాటు చేసుకునేందుకు సిద్ధమైతే.. షాపు తమకు వదిలిపోవాలని ఎమ్మెల్యే అనుచరగణం దౌర్జన్యానికి దిగి రచ్చరచ్చ చేసింది. దౌర్జన్యానికి పాల్పడింది ఎవరినో కాదు. కూటమిలోని జనసేన పార్టీ కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయశ్రీనివాస్ అనుచరులు కావడం విశేషం. ఈ వివాదం పోలీసుల దృష్టికి వెళ్లినా, ఇప్పటికీ అపరిష్కృతంగానే ఉంది. లీజుకు భూమి ఇచ్చిన పైడా శ్రీరామ్ దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. తాజాగా మంగళవారం తొండంగి మండలం ఏ.కొత్తపల్లిలో మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు అనుచరులైన నరాల సోమరాజు, వనపర్తి సత్తిబాబు.. అదే గ్రామానికి చెందిన పిల్లి అమ్మోరు అనే బాధితుడి ఇంటిని దౌర్జన్యంగా రాయించేసుకున్నారు. మూడు నెలల క్రితమే ఆమె తొండంగి ఎస్సై, పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం కనిపించ లేదు. అప్పటి నుంచి వేధింపులు తగ్గకపోగా, పెరిగిపోవడంతో గత్యంతరం లేక అమ్మోరు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అటు కాకినాడ రూరల్ కరపలో జనసేన ఎమ్మెల్యే నానాజీ అనుచరులైన నేతలు, ఇటు టీడీపీ మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు కుమార్తె దివ్య ప్రాతినిధ్యం వహిస్తున్న తునిలో ఒకే రోజు రెండు సంఘటనల్లో ఇరు పార్టీల ముఖ్య అనుచరులు అమాయకులపై బరితెగించి, దౌర్జన్యాలకు పాల్పడటంపై సర్వత్రా నిరసన వ్యక్తమవుతోంది. అలాగే టీడీపీ పిఠాపురం పట్టణ అధ్యక్షురాలు దుర్గాడ విజయలక్ష్మి భర్త టీడీపీ నేత లక్ష్మయ్య అలియాస్ జాన్ అధికారం చేతిలో ఉందన్న ధైర్యంతో బరితెగించి మైనర్ బాలికపై అఘాయిత్యానికి ఒడిగట్టాడు. ఈ నెల 4న మైనరు బాలికను ఆటోలో అపహరించి, మాధాపురం రోడ్డులో డంపింగ్ యార్డ్ వద్ద లైంగిక దాడికి పాల్పడ్డాడు..అతనికి సుబ్బలక్ష్మి అనే మహిళ సహకరించటం స్థానికంగా సంచలనం కలిగించింది.

దౌర్జన్యంగా ఇల్లు లాగేసుకున్నారు



ఏ.కొత్తపల్లి బాధితుడు అమ్మోరు వద్ద విలపిస్తున్న భార్య



టీడీపీ నాయకులు నరాల సోమరాజు, సత్తిబాబు పెద్ద మనుషులుగా చలామణీ అవుతూ, నాలాంటి వారికి అన్యాయం చేస్తున్నారు. నాకు భార్య, ఇద్దరు పిల్లలు. నా ఇల్లు దౌర్జన్యంగా లాగేసుకున్నారు. మా ఇల్లు మాకు ఇవ్వండని మొరపెట్టుకున్నా న్యాయం జరగలేదు. వంటిమామిడి ఎస్సై నెల రోజులుగా స్టేషన్ చుట్టూ తిప్పుకొన్నారు. అయినా మాకు న్యాయం జరగలేదు. నేను చదువుకోలేదు. చదువు లేకపోవడంతోనే ఎవరూ పట్టించుకోవడం లేదు. రూ.10 వడ్డీతో ముప్పుతిప్పలు పెడుతున్నారు. మా ఇల్లు మాకు తిరిగి ఇప్పించండి.

– పిల్లి అమ్మోరు, ఏ.కొత్తపల్లి, తొండంగి మండలం

జనసేన నేతల వేధింపులతోనే ఆత్మాహత్య యత్నం




జనసేన నేతలు బండారు మురళి, నానిబాబు తదితరులు నా భార్య సునీతను మూడు నెలల నుంచి వేధిస్తున్నారు. దొంగ మస్టర్లు వేసుకుంటారో, ఏమో తెలియదు.. మాకు నెలకు రూ.20 వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. డబ్బు ఇవ్వకుంటే మరొక మహిళను నియమించుకుంటామని, లైంగికంగా కూడా వేధింపులకు పాల్పడుతున్నారు. ఇది భరించలేక విధిలేని పరిస్థితుల్లో నా భార్య ఆత్మహత్య యత్నానికి పాల్పడింది. బాధ్యులను కఠినంగా శిక్షించాలి,

– పులపకూర వీరబాబు, ఫీల్డ్ అసిస్టెంట్ సునీత భర్త, పెనుగుదురు, కరప మండలం

జనసేన ముఖ్య నేతకు పరాభవం

- ఎమ్మెల్సీ ఎన్నికల కూటమి కరపత్రంలో ఫొటో మాయం
- భగ్గుమన్న జన సైనికులు
- టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌ను నిలదీసిన వైనం
- ఎక్కడో పొరబాటు జరిగిందంటూ సర్దుబాటు



జ్యోతుల నవీన్‌ను నిలదీస్తున్న జనసేన శ్రేణులు

సామర్లకోట: కూటమి నేతల మధ్య పొరపొచ్చాలు మరోసారి బహిర్గతమయ్యాయి. ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఏర్పాటు చేసిన సదస్సు ఇందుకు వేదికైంది. ఈ వ్యవహారంలో సాక్షాత్తూ జనసేన జిల్లా అధ్యక్షుడే పరాభవం చవిచూడాల్సి వచ్చింది. సార్వత్రిక ఎన్నికలు ముగిసిన నాటినుంచీ టీడీపీ, జనసేన నేతల మధ్య ఆధిపత్య పోరు అంతర్లీనంగా సాగుతోంది. తాజా సంఘటనతో ఇరుపార్టీలు మరోసారి రచ్చకెక్కడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. వివరాల్లోకి వెళితే.. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఓటర్ల నమోదు అవగాహన కార్యక్రమాన్ని కూటమి నేతలు మంగళవారం పెద్దాపురంలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ అధ్యక్షత వహించారు. టీడీపీ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పేరాబత్తుల రాజశేఖర్‌ను బలపర్చాలంటూ ముద్రించిన కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కరపత్రాలపై కూటమి ముఖ్య నేతల ఫొటోలు ముద్రించినప్పటికీ.. జనసేన పెద్దాపురం నియోజకవర్గ కన్వీనర్, పార్టీ జిల్లా అధ్యక్షుడు తుమ్మల బాబు ఫొటో ముద్రించ లేదు. ఇది కాస్తా జనసేన కార్యకర్తలకు తీవ్ర ఆగ్రహం తెప్పించింది. తాడోపేడో తేల్చుకోవడానికి వారు సన్నద్ధమయ్యారు. అంతటితో ఆగకుండా కార్యక్రమానికి హాజరైన జ్యోతుల నవీన్‌ను జనసేన కార్యకర్తలు అడ్డుకున్నారు. కరపత్రంపై తుమ్మల బాబు ఫొటో లేకపోవడంపై జ్యోతుల నవీన్‌ను నిలదీశారు. వేదికపైనే అందరికీ సమాధానం ఇస్తానంటూ నవీన్ సముదాయించే ప్రయత్నం చేశారు. ఎక్కడో, ఏదో పొరపాటు జరిగిందని, బుధవారం ఉదయానికి కరపత్రాలు మార్పు చేస్తామని జ్యోతుల నవీన్ హామీ ఇచ్చారు. ఇదంతా జరుగుతున్నంత సేపూ ,తుమ్మల బాబు వేదికపైనే ఉన్నారు. టీడీపీ నేత నవీన్ సమాధానం ఇచ్చాక, తుమ్మల బాబు సర్దిచెప్పడంతో జనసేన కార్యకర్తలు వెనక్కు తగ్గారు. కాగా ముఖ్య నేతలందరి ఫొటోలు ముద్రించి, కేవలం తుమ్మల బాబు ఫొటో ముద్రించకపోవడం కచ్చితంగా ఉద్దేశపూర్వకంగానే జరిగిందంటూ జనసేన శ్రేణులు చెవులు కొరుక్కోవడం కనిపించింది.

చిన్నారుల రక్షణకు ప్రాధాన్యం

- సురక్షిత జిల్లాగా కాకినాడ
- కలెక్టర్ షణ్మోహన్



ఎస్ఆర్ శంకరన్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ షణ్మోహన్

కాకినాడ సిటీ: జిల్లాలో చిన్నారుల భద్రత, రక్షణకు అధిక ప్రాధాన్యమిస్తూ, నూరు శాతం చిన్న పిల్లల సురక్షిత జిల్లాగా కాకినాడను తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని కలెక్టర్ షణ్మోహన్ సగిలి అధికారులను ఆదేశించారు. చిన్నారుల భద్రత, సంరక్షణ, లైంగిక వేధింపులకు గురికాకుండా కాపాడుకోవడం వంటి అంశాలపై కాకినాడ సీపోర్టు లిమిటెడ్, పడాల చారిటబుల్ ట్రస్ట్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా అధికారులకు వర్క్‌షాపు జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ, నిత్యం చిన్నారులు ఏదోరకంగా లైంగిక వేధింపులకు గురవుతున్నారన్నారు. చిన్న పిల్లలతో ప్రవర్తించాల్సిన తీరుపై సరైన అవగాహన లేకపోవడం వల్ల వారు తరుచూ లైంగిక వేధింపులకు గురవుతున్నారన్నారు. 18 ఏళ్లలోపు ప్రతి ఒక్కరూ పిల్లలేనని చెప్పారు. ప్రభుత్వ, ప్రైవేటు స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో తల్లిదండ్రులతో పాటు, చిన్నారులకు సురక్షిత స్పర్శ, చెడు స్పర్శ వంటి అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. అలాగే జిల్లా హెల్ప్‌లైన్ నంబర్ ఏర్పాటు చేసి, సమస్యలను పరిష్కరించే చర్యలు తీసుకుంటామని వివరించారు. పడాల చారిటబుల్ ట్రస్ట్ సీఈవో సూర్య ప్రసాద్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అధికారులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ భావన, అడిషనల్ ఎస్పీ ఎంజేఈ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

గొప్ప మానవతావాది శంకరన్

దేశ చరిత్రలోనే ఐఏఎస్ అధికారుల్లో ఉన్నత ఆదర్శ విలువలు కలిగిన గొప్ప మానవతావాది ఎస్ఆర్ శంకరన్ అని కలెక్టర్ షణ్మోహన్ సగిలి కొనియాడారు. ఎస్ఆర్ శంకరన్ 90వ జయంతి సందర్భంగా కలెక్టరేట్ ఆవరణలో ఉన్న ఆయన విగ్రహానికి కలెక్టర్‌తో పాటు, ట్రైనీ కలెక్టర్ హెచ్ఎస్ భావన, డీఆర్ఓ డి.తిప్పేనాయక్, ఆర్డీఓ ఎస్ మల్లిబాబు, జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ వైడీ రామారావు తదితరులు ఘనంగా నివాళులర్పించారు. కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ, సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి శంకరన్ ఎంతగానో పాటుపడ్డారన్నారు. దళిత నాయకుడు అయితాబత్తుల రామేశ్వరరావు, సీపీఐ నాయకుడు తాటిపాక మధు తదితరులు పాల్గొన్నారు.

ప్రసాద్‌కు శఠగోపమేనా..!

- రత్నగిరిపై రూ.20 కోట్ల టెండర్లకు జాప్యమెందుకో?
- గత నెలలో టెండర్లు పిలిచిన టూరిజం శాఖ
- దాఖలు చేసిన 12 ప్రముఖ సంస్థలు
- సెప్టెంబర్ 25తో ముగిసిన కాల పరిమితి
- కూటమి మంత్రి సన్నిహితుడికి కట్టబెట్టేందుకే అంటూ అనుమానాలు



అన్నవరం: ప్రముఖ పుణ్య క్షేత్రమైన అన్నవరంలోని శ్రీవీరవేంకట సత్యనారాయణ స్వామి దేవస్థానానికి కేంద్ర పిలిగ్రిమేజ్ రీజువినేషన్ అండ్ స్పిర్చువల్ అగ్మెంటేషన్ (ప్రసాద్) స్కీం కింద మంజూరు చేసిన రూ.20 కోట్లతో చేపట్టే నిర్మాణాలకు పిలిచిన టెండర్ల జాప్యంలో కారణాలపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గత నెల మూడో తేదీన పిలిచిన ఈ టెండర్ల కాల పరిమితి గత నెల 25తో ముగిసింది. వెంటనే ఆ టెండర్లను ఓపెన్ చేసి, లోయెస్ట్ కొటేషన్ ఇచ్చిన సంస్థను ఎంపిక చేయాలి. వివిధ కారణాలతో ఈ ప్రక్రియలో జాప్యం జరుగుతుండడం విమర్శలకు దారితీస్తోంది.

ఈ టెండర్లలో 12 ప్రముఖ నిర్మాణ సంస్థలు పాల్గొన్నాయి. అందులో ఒకటి రాష్ట్రంలో అధికార కూటమిలోని మంత్రికి చెందిన సంస్థ అని, దానికి ఈ టెండర్లు కట్టబెట్టేందుకే రాష్ట్ర టూరిజం శాఖాధికార్లపై ఒత్తిడి తెస్తున్నట్టు చెబుతున్నారు. ఫలితంగా టెండరు ప్రక్రియకు ఆలస్యమవుతోందన్న విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. ఈ–ప్రొక్యూర్‌మెంట్ ద్వారా జరిగిన ఈ టెండర్ల ప్రక్రియలో టెక్నికల్ బిడ్‌లో అర్హత సాధించి, ఫైనాన్షియల్ బిడ్‌లో లోయెస్ట్ కొటేషన్ దాఖలు చేసిన సంస్థకే ఈ టెండర్లు వస్తాయని, ఎటువంటి అవకతవకలకు అవకాశం లేదని టూరిజం శాఖ అధికారులు చెబుతున్నారు.

రూ.20 కోట్లతో..

ప్రసాద్ పథకం కింద దేవస్థానంలో రూ.20 కోట్లతో అన్నదాన భవనం, క్యూ కాంప్లెక్స్, పురుషులు, మహిళలకు విడిగా టాయిలెట్ బ్లాక్‌లు, భక్తుల కోసం రెండు బ్యాటరీ కార్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. గత మార్చి ఏడున ప్రధాని మోదీ జమ్ము కాశ్మీర్ రాజధాని శ్రీనగర్ నుంచి వీటిని లాంఛనంగా ప్రారంభించారు. ' దేవస్థానంలోని పాత టీటీడీ భవనం స్థలంలో రూ.పది కోట్ల వ్యయంతో రెండంతస్తుల అన్నదాన భవనం నిర్మించేందుకు నిర్ణయించారు. ప్రస్తుత అన్నదాన భవనం పక్కన రూ.ఆరు కోట్లతో క్యూ కాంప్లెక్స్ నిర్మించనున్నారు. ప్రకాష్ సదన్ వెనుక పార్కింగ్ ప్రదేశంలో రూ.మూడు కోట్లతో టాయిలెట్స్ బ్లాక్ నిర్మించాలని నిర్ణయించారు. దేవస్థానానికి రూ.కోటి వ్యయంతో భక్తుల కోసం రెండు బ్యాటరీ కార్లు కూడా మంజూరు చేశారు.

నాలుగు పనులకు టెండర్లు

ఆయా నిర్మాణాలకు రాష్ట్ర టూరిజం శాఖ ఈ–ప్రొక్యూర్‌మెంట్ విధానంలో సెప్టెంబర్ మూడున విడివిడిగా నాలుగు టెండర్లు పిలిచింది. ఇందులో 12 ప్రముఖ నిర్మాణ సంస్థలు టెండర్లు దాఖలు చేశాయి. ప్రస్తుతం రాష్ట్రంలో వెనువెంటనే బిల్లులు మంజూరయ్యే పరిస్థితి లేదు. ప్రసాద్ పథకం నిధులు రూ.20 కోట్లు రెండు నెలల క్రితం పర్యాటక శాఖకు జమ కావడంతో, పెద్ద నిర్మాణ సంస్థలు ఆసక్తి చూపాయి.



రత్నగిరిపై నిర్మించనున్న అన్నదాన భవనం ప్లాన్

రెండు, మూడు రోజుల్లో టెండర్లు ఖరారు

అన్నవరం దేవస్థానంలో ప్రసాద్ స్కీం టెండర్లు రెండు, మూడు రోజుల్లో ఖరారు చేస్తాం. ప్రస్తుతం టెక్నికల్ బిడ్స్ తెరిచి టెండర్‌దారులు జత చేసిన పత్రాలను పరిశీలించే ప్రక్రియ కొనసాగుతోంది. ఇది ముగిసిన వెంటనే ఫైనాన్షియల్ బిడ్స్ తెరిచి టెండర్లు ఖరారు చేస్తాం.

– ఈశ్వరయ్య, ఇన్‌చార్జి సీఈ, టూరిజం శాఖ

మంత్రి సన్నిహితుడి కోసం జాప్యం!

టెండర్ దాఖలుకు సెప్టెంబర్ 25 చివరితేదీ. ఆ తర్వాత దాఖలైన టెండర్లలో అర్హత నిర్ధారించే టెక్నికల్ బిడ్స్ ఓపెన్ చేసి, అర్హులైన టెండర్‌దారుల ఫైనాన్స్ బిడ్లనూ ఓపెన్ చేయాలి. లోయెస్ట్ టెండర్‌దారులను ఎంపిక చేయాలి. దీనికి పది రోజుల సమయం చాలు. టెండర్ ప్రక్రియ ముగిసి నెల అవుతున్నా.. ఇంకా కొలిక్కి రాలేదు. దీనివెనుక అధికార కూటమిలోని ఓ మంత్రి సన్నిహితుడి సంస్థకు టెండర్లు దక్కేలా చేయడానికేనన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అర్హులైన టెండర్‌దారులను ఏదోలా డిస్‌క్వాలిఫై చేయాలని అధికారులపై ఒత్తిడి తెస్తున్నట్టు సమాచారం. ఈ–ప్రొక్యూర్‌మెంట్‌లో ఏ అవకతవకలు జరిగినా వెంటనే తెలిసిపోతుంది. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కోర్టును ఆశ్రయిస్తామని ఓ కాంట్రాక్టర్ తెలిపారు.



క్యూ కాంప్లెక్స్ నమూనా

ఉప కులపతుల నియామకానికి వేళాయె..

- సెర్చ్ కమిటీ ఎంపికపై ఉత్కంఠ
- ఇన్‌చార్జి పాలనలోనే వీసీలు

బాలాజీచెరువు(కాకినాడ సిటీ): విశ్వవిద్యాలయాల ఉప కులపతుల నియామకానికి కూటమి ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన పది రోజుల్లోనే రాష్ట్రంలో అన్ని వర్సిటీల వీసీలు రాజీనామా చేయాలని అనధికారికంగా మౌఖిక ఆదేశాలు జారీ చేయడంతో.. వీసీలందరూ రాజీనామా చేశారు. ఇందులో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో జేఎన్‌టీయూ కాకినాడ వర్సిటీతో పాటు, ఆదికవి నన్నయ వర్సిటీలున్నాయి. జేఎన్‌టీయూకే వీసీ పదవీ కాలం ఈ నెల 23 వరకూ ఉండగా, నన్నయ వర్సిటీ వీసీ పదవీకాలం మరో రెండేళ్లు ఉండగానే రాజీనామా చేయించారు. ప్రస్తుతం ఆయా వర్సిటీలకు ఇన్‌చార్జి వీసీలను నియమించారు.

దరఖాస్తుదారుల పైరవీలు

రెగ్యులర్ వీసీల నియామకానికి ఉన్నత విద్యా మండలి దరఖాస్తులు స్వీకరించింది. దీంతో జేఎన్‌టీయూకే నుంచి దాదాపు 20 మంది వరకూ దరఖాస్తు చేశారు. దరఖాస్తు చేసిన వారందరూ వారి కుల సామాజిక పరంగా, రాజకీయంగా పలుకుబడి ఉన్న వారితో పైరవీలు సాగిస్తున్నారు. రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్‌తో నేరుగా సాన్నిహిత్యం ఉన్న, జిల్లాకు చెందిన వారితో తమ బయోడేటాలు పంపుతున్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో వర్సిటీలో కీలక హోదాలో పనిచేసిన వారు సైతం, సీఎం సామాజిక వర్గానికి చెందిన సీనియర్ ప్రొఫెసర్ సహకారంతో ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే జేఎన్‌టీయూకేలో ప్రొఫెసర్ మురళీకృష్ణను జేఎన్‌టీయూ కాకినాడ వర్సిటీకి ఇన్‌చార్జి వీసీగా నియమించగా, మరో ప్రొఫెసర్ ఆర్.శ్రీనివాసరావును కృష్ణా వర్సిటీ ఇన్‌చార్జి వీసీగా, ఆదికవి నన్నయ వర్సిటీకి ఇన్‌చార్జి వీసీగా వై.శ్రీనివాసరావును నియమించారు.

25లోపు ప్రతిపాదించాలి

ఈ నెల 25లోపు విశ్వవిద్యాలయాల సెర్చ్ కమిటీ సభ్యుడి పేరును ప్రతిపాదించాలని ఉన్నత విద్యా మండలి నుంచి వర్సిటీలకు ఆదేశాలు వచ్చాయి. అప్పటి లోగా విశ్వవిద్యాలయాల పాలక మండలి సమావేశంలో సభ్యుడి పేరును తీర్మానం చేయాలి. పాలక మండలి సూచించే సభ్యుడు సీనియర్ ఆచార్యులై ఉంటారు. స్థానిక వర్సిటీలో ఆచార్యుడు కాకుండా, ఇతర విశ్వవిద్యాలయాల ఆచార్యులను పాలక మండలి సభ్యుడిగా నియమించాలి.

వారి సూచనలే కీలకం

వీసీల ఎంపికకు సెర్చ్ కమిటీ సూచనలు ఇస్తుంది. సెర్చ్ కమిటీలో ముగ్గురు సభ్యులుంటారు. యూజీసీ, ప్రభుత్వం, వర్సిటీ పాలక మండలి ఒకొక్క అభ్యర్థిని ప్రతిపాదిస్తారు. సెర్చ్ కమిటీ వారి దరఖాస్తులను పరిశీలిస్తుంది. ఆచార్యుల అనుభవం, పరిశోధనలు తదితర అంశాలను పరిశీలించి ఉన్నత విద్యా మండలికి సూచనలిస్తారు. అనంతరం గవర్నర్ వీసీలను నియమిస్తారు.

క్లుప్తంగా

టెన్నిస్ క్రీడాకారుల ఎంపికలు



అండర్ 14 విభాగంలో రాష్ట్రస్థాయి టెన్నిస్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో మంగళవారం అండర్ 14, 17, 19 విభాగాల్లో టెన్నిస్ క్రీడాకారుల ఎంపికలు ఉత్సాహంగా జరిగాయి. వీటిని ఏపీలాన్ టెన్నిస్ సంఘ కార్యదర్శి పీవీ రామ్ కుమార్ ప్రారంభించారు. బాలురు, బాలికల జట్లను రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు.

= అండర్ 14 బాలికల విభాగంలో పి.లోచన (సామర్లకోట), ఎన్.మానవీదేవి (కాకినాడ), కె.తేజశ్రీ (రాజమహేంద్రవరం), ఎం.ధరణి (రాజమహేంద్రవరం), బి.తేజశ్రీ (కాకినాడ), బాలుర విభాగంలో కేఎస్ ప్రతీక్ (కాకినాడ), జి.నిఖిలేష్ (కాకినాడ), ఎన్‌టీఎస్‌టీ సుభాష్ (కాకినాడ), వై.ఇషాన్ (రాజమహేంద్రవరం), ఎస్.నాగచరణ్ (కాకినాడ), ఎస్‌వీవీ జోషి (రామహేంద్రవరం) ఎంపికయ్యారు.

- అండర్ 17 బాలుర విభాగంలో ఎస్.కృష్ణ సాహిత్ (కాకినాడ), ఎస్ఎండీ ఫైజల్ (రాజమహేంద్రవరం), టీకే కౌషిక్ (కాకినాడ), పి.లోకేష్ (కాకినాడ), ఎన్‌జేఎస్‌వీ నేత్ర (కాకినాడ), ఎస్.జైన్ (కాకినాడ)లు ఎంపికయ్యారు. బాలికల విభాగంలో జి.శేషసాయి, జైన అయాన్, డి.అశ్రిత, ఎస్ఎస్ అన్విత, సీహెచ్ఎల్వీ మనస్వి (కాకినాడ)లు ఎంపికయ్యారు.
- అండర్ 19 బాలుర విభాగంలో పీఆర్‌కే నీరజ్, ఎస్ఎస్ సాకేత్, ఆర్‌డీఎస్ తనిష్క, కేపీ కుమార్, పి.ప్రణవ్ కృష్ణ (కాకినాడ)ను ఎంపిక చేశారు., బాలికల విభాగంలో ఎం.మైత్రి లేఖన (కాకినాడ), కె.దేవి (పిఠాపురం), పి.పుష్పలత (చొల్లంగి), ఆర్ వీర శ్రావణి (చొల్లంగి), పీఎస్ఎల్ అభిజ్ఞ (కాకినాడ) ఎంపికయ్యారు. ఈనెల 28, 29, 30 తేదీలలో కాకినాడ డీఎస్ఏలో జరిగిన జరిగే రాష్ట్రస్థాయి లాన్ టెన్నిస్ ఎస్‌జీఎఫ్ఐ పోటీలలో జిల్లా తరఫున వీరు పాల్గొంటారు.


విద్యార్థిని మృతిపై కేసు

ఆలమూరు: అనుమానాస్పద స్థితిలో విద్యార్థిని మృతి చెందిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై ఎం.అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. మడికి శివారు చిలకలపాడుకు చెందిన చెక్కపల్లి వెన్నెల (15) సమీపంలోని చెముడులంకలోని ఒక ప్రైవేట్ కార్పొరేట్ స్కూల్లో పదోతరగతి చదువుతోంది. ఈ నెల 18వ తేదీ తెల్లవారుజామున ఇంట్లో ఉరి వేసుకుని మృతి చెందింది. కార్పొరేట్ స్కూల్ యాజమాన్యం ఒత్తిడి, వేధింపుల వల్లే తమ కుమార్తె మృతి చెందిందని తండ్రి బాబీ మంగళవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా.. విషయం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో మండల విద్యాశాఖ స్పందించి జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసింది. డీవైఈఓ నరసింహ ఫణి మంగళవారం సాయంత్రం వెన్నెల మృతిపై విచారణ జరిపారు. సహచర విద్యార్థులను ప్రశ్నించి వివరాలను నమోదు చేసుకున్నారు.

భవితకు పునాది

- ఎఫ్ఎల్ఎన్ అమలుకు విద్యాశాఖ కసరత్తు
- 1, 2 తరగతుల విద్యార్థుల ప్రగతికి చర్యలు
- ఉపాధ్యాయులకు శిక్షణ ప్రారంభం





ఎఫ్ఎల్ఎన్ లోగో

రాయవరం: ఒక భవనాన్ని నిర్మించేటప్పుడు పునాది బలంగా వేయాలి. అప్పుడే ఆ పునాదిపై ఎన్ని అంతస్తుల నిర్మాణమైనా చేయవచ్చు. ఇదే విధానం విద్యాభ్యాసంలో విద్యార్థికి వర్తిస్తుంది. ఒక విద్యార్థికి పూర్వ ప్రాథమిక, ప్రాథమిక స్థాయిలో పునాది బలం ఉంటేనే అతడు అభ్యసనా సామర్థ్యాలను సులభంగా సాధిస్తాడు. అందుకే ప్రాథమిక స్థాయిలో విద్యార్థి అభ్యసనా సామర్థ్యాల పెంపుదలకు ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీ (ఎఫ్ఎల్ఎన్) కార్యక్రమాన్ని విద్యాశాఖ, సమగ్ర శిక్షా సంయుక్తంగా చేపట్టాయి. సపోర్టింగ్ ఆంధ్రాస్ లెర్నింగ్ ట్రాన్స్‌ఫర్మేషన్ (సాల్ట్)లో భాగంగా ఎన్‌జీవో సంస్థ ప్రథమ్ భాగస్వామ్యంతో ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమాన్ని ప్రాథమిక పాఠశాలల్లో అమలుకు పాఠశాల విద్యాశాఖ చర్యలు కసరత్తు చేస్తోంది. అందులో భాగంగా ఇప్పటికే డీఆర్పీలకు శిక్షణ ఇవ్వగా, ఇప్పుడు శిక్షణ పొందిన డీఆర్పీలు ఒకటో తరగతికి బోధన చేసే ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నారు.

విద్యా సంస్కరణలు

నూతన విద్యా విధానం–2020లో భాగంగా ప్రభుత్వం పలు విద్యా సంస్కరణలను ప్రవేశ పెట్టింది. నిపుణ్ భారత్ లక్ష్యాలను సాధించే క్రమంలో భాగంగా ఎర్లీ చైల్డ్ సెంటర్ ఎడ్యుకేషన్ (ఈసీసీఈ)ని ప్రవేశ పెట్టారు. ఇందులో ప్రీ ప్రైమరీ 1, ప్రీ ప్రైమరీ 2ను అమలు చేస్తున్నారు. ప్రీ ప్రైమరీ 1లో 3 నుంచి 4 ఏళ్ల చిన్నారులకు, ప్రీ ప్రైమరీ 2లో 4 నుంచి 5 ఏళ్ల చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యాబోధన చేస్తారు.

ఎఫ్ఎల్ఎన్ ఎందుకంటే..

ప్రతి విద్యార్థి ఆయా తరగతుల అభ్యసనా సామర్థ్యాలను పెంపొందించుకోవాలి. అయితే పదో తరగతికి చేరుకుంటున్న విద్యార్థులకు కూడా తెలుగు, గణితంలో ప్రాథమిక భావనలు తెలియడం లేదన్న కఠోర వాస్తవాలను అసర్, నాస్, శ్లాస్ తదితర నివేదికలు బహిర్గతం చేశాయి. దీంతో ప్రభుత్వం పూర్వ ప్రాథమిక, ప్రాథమిక స్థాయిలో విద్యార్థులు అభ్యసనా సామర్థ్యాలను సాధించేందుకు అవసరమైన అన్ని రకాల చర్యలు చేపడుతుంది. అందులో భాగంగానే ఫౌండేషన్ లిటరసీ, న్యూమరసీ కార్యక్రమం చేపట్టింది. విద్యార్థి 1, 2 తరగతులు పూర్తి చేసి మూడవ తరగతిలో చేరే సమయానికి తెలుగులో చదవడం, రాయడం, వినడం, మాట్లాడడం రావాల్సి ఉంటుంది. గణితంలో చతుర్విధ ప్రక్రియలైన కూడికలు, తీసివేతలు, గుణకారం, భాగహారంపై నైపుణ్యాలను సాధించాలి.

ప్రీ ప్రైమరీలోనే పాఠశాల సంసిద్ధతా కార్యక్రమాలను అమలు చేస్తారు. ఐదేళ్లు నిండిన చిన్నారులకు ప్రైమరీ తరగతులు నిర్వహిస్తారు. ప్రీ ప్రైమరీ, ప్రైమరీలో 1, 2 తరగతులకు ఫౌండేషన్ లిటరసీ, న్యూమరసీ కార్యక్రమాన్ని అమలు చేయనున్నారు. ఈ కార్యక్రమం ద్వారా 2026–27 విద్యా సంవత్సరానికి రెండు నుంచి మూడో తరగతికి వెళ్లే విద్యార్థులందరూ ఆయా తరగతుల అభ్యసనా సామర్థ్యాలను కచ్చితంగా పొందాలి.

బ్యాచ్‌ల వారీగా శిక్షణ

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల నుంచి ఒకటో తరగతి విద్యార్థులకు బోధన చేసే ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నారు. పూర్తి స్థాయి రెసిడెన్షియల్ విధానంలో ఉపాధ్యాయులకు ఇచ్చే శిక్షణకు తూర్పుగోదావరి జిల్లా కొండగుంటూరులోని సత్యసాయి పరిమళ పాలిటెక్నిక్ కళాశాలను శిక్షణా కేంద్రంగా రాష్ట్ర స్థాయి అధికారులు ఎంపిక చేశారు. మొదటి స్పెల్‌లో 90 మంది ఒకటో తరగతి బోధన చేసే ఉపాధ్యాయులు శిక్షణ పొందుతున్నారు. ప్రతి బ్యాచ్‌కు ఆరు రోజుల పాటు శిక్షణ జరుగుతుంది. జిల్లాకు చెందిన 1,285 మంది ఉపాధ్యాయులకు 14 బ్యాచ్‌ల్లో శిక్షణ ఇవ్వనున్నారు. గతేడాది ఆగస్టులో ఎఫ్ఎల్ఎన్ జ్ఞానప్రకాష్ సర్టిఫికెట్ కోర్సులో శిక్షణ పొందిన డీఆర్పీలు, కేఆర్పీలు ఒకటవ తరగతి బోధన చేసే ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నారు. గతేడాది ఆగస్టులో జిల్లా నుంచి 66 మంది డీఆర్పీలుగా శిక్షణ పొందారు. వారిని బ్యాచ్‌ల వారీగా శిక్షణ ఇచ్చేందుకు పంపిస్తారు.

శిక్షణలో పాల్గొన్న ఉపాధ్యాయులు

సద్వినియోగం



ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీలో భాగంగా ఇస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకుంటాం. ఒకటవ తరగతి విద్యార్థికి పునాది చాలా అవసరం. ఆ సమయంలోనే చదవడం, రాయడం, గణితంలో ప్రాథమిక భావనలను తెలియజేయాలి. వీటి కోసం ఈ శిక్షణ చాలా ఉపయోగ పడుతుంది.

– జోస్యుల రాధాకృష్ణవేణి, సెకండరీ గ్రేడ్ టీచర్, ఎంపీయూపీ స్కూల్, లొల్ల, రాయవరం మండలం

చాలా కీలకం



ఎనిమిది సంవత్సరాలు వచ్చే సరికీ పిల్లల్లో ప్రాథమిక విద్యకు పునాది పడాలి. ఆ సమయమే వారి పెరుగుదల, అభివృద్ధికి చాలా కీలకం. దానివల్ల చిన్నారుల భవిష్యత్తు అభ్యసనానికి పునాది ఏర్పడుతుంది. శిక్షణలో తెలుసుకున్న విషయాలను పిల్లలకు బోధించడం వల్ల వారి ప్రగతికి బాటలు పడతాయి.

– గుబ్బల దుర్గాప్రసాద్, డీఆర్పీ, మలికిపురం మండలం

ఉపాధ్యాయులకు శిక్షణ



గతేడాది ఆగస్టులోనే జ్ఞాన ప్రకాష్, జ్ఞాన జ్యోతి ప్రోగ్రామ్‌లో భాగంగా మండలానికి ఆరుగురు డీఆర్పీలకు శిక్షణనిచ్చాం. ఇప్పుడు ఒకటవ తరగతి బోధన చేసే ప్రతి ఉపాధ్యాయుడికి శిక్షణనిస్తున్నాం. శిక్షణను సద్వినియోగం చేసుకుంటే పునాది అభ్యసనం మెరుగవుతుంది.

– అరవ ప్రభాకర్, శిక్షణ కార్యక్రమ రాష్ట్ర పరిశీలకుడు, విజయవాడ

బోధనకు ఉపయోగం



ఎఫ్ఎల్ఎన్ శిక్షణ పూర్తిగా రెసిడెన్షియల్ విధానంలో జరుగుతుంది. బ్యాచ్‌కు 250 మంది ఎస్‌జీటీలకు శిక్షణ ఇస్తున్నాం. ఆరు రోజుల పాటు జరిగే శిక్షణకు అవసరమైన ఏర్పాట్లను ఉన్నతాధికారులు ఏర్పాటు చేశారు. కచ్చితంగా ఈ శిక్షణ ఉపాధ్యాయులకు బోధనలో ఉపకరిస్తుంది.

– గౌరీ శంకర్, ఏఎంవో, తూర్పుగోదావరి జిల్లా

మరణంలోనూ ఒకరికొకరు

- అంబాజీపేటలో దంపతుల ఆత్మహత్య
- ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్య సమస్యలే కారణం
- సూసైడ్ నోట్ స్వాధీనం చేసుకున్న పోలీసులు



రాంబాబు, నాగమణి దంపతులు (ఫైల్)



నాగమణి మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై చైతన్యకుమార్

అంబాజీపేట: అంబాజీపేట పెద్దవీధిలో ఉంటున్న పాబోలు రామసుబ్రహ్మణ్యం (రాంబాబు) (60), నాగమణి (57) దంపతులు మంగళవారం ఉదయం ఆత్మహత్య చేసుకున్నారు. ఆర్థిక సమస్యలు, అనారోగ్య, వ్యక్తిగత కారణాలతో చనిపోతున్నామని సూసైట్ రాశారు. దీంతో ఆ ప్రాంతంలో విషాద ఛాయలు అలముకున్నాయి. స్థానికులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. రాంబాబు, నాగమణి దంపతులు వారి రెండో కుమార్తె వంకాయల సునీత, మనవరాలు మానసతో కలిసి ఉంటున్నారు. సునీత, మానస రెండు రోజుల క్రితం బంధువు పెళ్లికి విశాఖపట్నం వెళ్లారు. ఇంటిలో ఎవరూ లేని సమయంలో రాంబాబు దంపతులు ఆత్మహత్యకు చేసుకున్నారు. సుబ్రహ్మణ్యం మేడ కింద మెట్ల వద్ద ఉరి వేసుకోగా, నాగమణి మంచంపై అచేతనంగా పడి ఉన్నారు. సమీపంలోని బంధువులు ఈ విషయాన్ని గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు.

వ్యాపారంలో నష్టాలు

రాంబాబు గతంలో స్థానిక బేతాళ స్వామి గుడి సమీపంలోనూ, అయినవిల్లి మండలం సిరిపల్లి వద్ద సుబ్రహ్మణ్యేశ్వర ఆగ్రో ప్రొడక్ట్స్ పేరుతో కొబ్బరి నూనె, పామాయిల్ వ్యాపారం చేసేవారు. వాటితో పాటు అంబాజీపేట మండలం కముజువారి లంక వద్ద పామాయిల్ నర్సరీని నిర్వహించేవారు. అయితే వ్యాపారంలో నష్టాలు రావడంతో అన్నీ విక్రయించేశారు. ఏడేళ్లుగా ఆదిత్య గార్మెంట్స్ పేరుతో వస్త్ర వ్యాపారాన్ని ప్రారంభించారు. దీనిలోనూ నష్టాలు రావడంతో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు.

పదేళ్ల క్రితం కుమారుడి కుటుంబం ఆత్మహత్య

రాంబాబు దంపతుల కుమారుడు కిరణ్, కోడలు లక్ష్మీ శ్వేత, మనువరాలు శ్రావణి, తొమ్మిది నెలల మనవడు పదేళ్ల క్రితం రాజమహేంద్రవరంలోని ఓ ప్రైవేటు హోటల్‌లో ఆత్మహత్య చేసుకున్నారు. అప్పటి నుంచి దంపతులిద్దరూ మనోవేదనతో గడుపుతున్నారు. కరోనా అనంతరం వారి ఆరోగ్య పరిస్థితి మరింత క్షీణించింది. మరో పక్క ఆర్థిక ఇబ్బందులు తలెత్తాయి.

మీ కూతుళ్లుగా చూసుకోండి

తన కుమార్తె సునీత, మనవరాలు మానసలను ఏలోటు లేకుండా చూసుకోవాలని తన తమ్ముళ్లయిన కృష్ణ, శ్రీనులను రాంబాబు సూసైట్ నోట్‌లో కోరారు. తమకు వారు ఎన్నో సేవలు చేశారన్నారు. తాను, తన భార్య ఆర్థికంగా, మానసికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, ఆరోగ్యం కూడా సహకరించడం లేదన్నారు. కాగా.. విషయం తెలిసిన వెంటనే నగరం ఎస్సై ఎ.చైతన్యకుమార్, అంబాజీపేట పోలీస్ సిబ్బంది సంఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలు నమోదు చేశారు. రాంబాబు రాసిన సూసైడ్ నోట్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై వై.సూర్యనారాయణ తెలిపారు. మృతదేహాలను అమలాపురం ఏరియా ఆస్పత్రికి పోస్టుమార్టం కోసం తరలించారు.

లిక్కర్ ఫ్యాక్టరీలో సీఐడీ తనిఖీలు

పెదపూడి: అనపర్తి మండలం కొప్పవరం గ్రామంలోని బీడీహెచ్ ఆగ్రో వెంచర్స్ ప్రైవేటు లిమిటెడ్ (లిక్కర్ ఫ్యాక్టరీ)లో వైజాగ్ నుంచి వచ్చిన సీఐడీ డీఎస్పీ నాగేంద్ర భూపాల్ ఆధ్వర్యంలో సీఐడీ, ఎక్సైజ్ శాఖాధికారులు తనిఖీలు నిర్వహించారు. మంగళవారం ఉదయం 10 గంటల నుంచి పరిశ్రమలో సోదాలు కొనసాగుతున్నాయి. అధికారులు పలు కీలక, హార్డ్ డిస్కులు, ఫైళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఇక్కడ బీరుతో పాటు ఆల్కాహాలు కూడా తయారు చేస్తున్నారు. అయితే దీనిపై మీడియాకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదు.

ట్రాక్టర్ ఢీకొని యువకుడి మృతి



బాలసుబ్రహ్మణ్యం (ఫైల్)

రాయవరం: ట్రాక్టర్ ఢీకొని పసలపూడి గ్రామానికి చెందిన చిటికెన బాల సుబ్రహ్మణ్యం (21) మృతి చెందాడు. వెల్డింగ్ పనులు చేసుకునే బాలసుబ్రహ్మణ్యం మంగళవారం తెల్లవారుజామున టిఫిన్ తినేందుకు రామచంద్రపురం వెళ్లాడు. అక్కడి నుంచి తిరిగి వస్తుండగా వెదురుపాక నుంచి పశువుల వ్యర్థాలతో వెళుతున్న ట్రాక్టర్ ఢీకొంది. తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు రామచంద్రపురం ఏరియా ఆస్పత్రికి తరలించగా అక్కడ మృతి చెందాడు. ఎస్సై పి.బుజ్జిబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇద్దరు అంతర్ జిల్లా దొంగల అరెస్టు

- 110 గ్రాముల బంగారు ఆభరణాల స్వాధీనం
- వివరాలు వెల్లడించిన సీఐ విద్యాసాగర్



ఆలమూరులో విలేకరులకు వివరాలు వెల్లడిస్తున్న సీఐ విద్యాసాగర్

ఆలమూరు: రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో చోరీలకు పాల్పడుతూ ఆరేళ్లుగా తప్పించుకు తిరుగుతున్న ఇద్దరు అంతర జిల్లా దొంగలు ఎట్టకేలకు చిక్కారు. వారు ఇప్పటి వరకూ చేసిన చోరీల సొత్తును రికవరీ చేసేందుకు రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్.విద్యాసాగర్ నేతృత్వంలోని పోలీసులు చర్యలు చేపట్టారు. ఆలమూరు పోలీసు స్టేషన్‌లో ఎస్సై ఎం.అశోక్ ఆధ్వర్యంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ విద్యాసాగర్ వివరాలు వెల్లడించారు. జొన్నాడకు చెందిన చిటికెన సోమరాజు నెల రోజుల క్రితం అనారోగ్యంతో బాధపడుతున్న తన భార్య సీతను వైద్యం కోసం హైదరాబాద్ తీసుకువెళ్లారు. అక్కడే తన పెద్ద కుమార్తె ఇంటిలో ఉంటూ ఆమెకు వైద్యం చేయిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈనెల 17న మెయిన్ రోడ్డు సమీపంలోని సోమరాజు నివాసానికి రోజూ మాదిరిగానే పనిచేసే మహిళ వచ్చింది. కానీ ఆ ఇంటి తలుపులు తెరిచి ఉండడం, వస్తువులన్నీ చిందరవందరగా ఉండడంతో హైదరాబాద్‌లోని సోమరాజుకు సమాచారం ఇచ్చింది. దీంతో హుటాహుటిన ఇంటికి చేరుకున్న సోమరాజు, కుటుంబ సభ్యులు ఇంట్లోని వస్తువులన్నీ పరిశీలించారు. బీరువాలోని సుమారు రూ.23 లక్షల విలువైన 312 బంగారం అపహరణకు గురైనట్లు గుర్తించారు.

పోలీసుల దర్యాప్తు

బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్సై అశోక్ కేసు నమోదు చేశారు. కొత్తపేట డీఎస్పీ వై.గోవిందరాజు ఆదేశాల మేరకు సీఐ విద్యాసాగర్ దర్యాప్తు చేపట్టారు. స్థానిక ఐడీ పార్టీ సహకారంతో గ్రామంలోని సీసీ కెమెరాల ఆధారంగా నిందితులను గుర్తించారు. ఇప్పటికే 60కి పైగా కేసులున్న పశ్చిమగోదావరి జిల్లాలోని భీమవరంలోని గుడుపూడికి చెందిన పందిరి వెంకటనారాయణ (నారిగాడు), 25కు పైగా కేసులున్న నెల్లూరులోని కోటమెట్ట షాదీ మందిర్‌కు చెందిన షేక్ అహ్మద్ బాషాను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి ప్రస్తుతం రూ 7.7 లక్షల విలువైన 110 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. మిగిలిన బంగారాన్ని నెల్లూరులో ఒక ప్రైవేటు బ్యాంకులో తాకట్టు పెట్టినట్లు నిందితులు తెలిపారు. నిందితులిద్దరిని బుధవారం స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో హాజరు పరచి కస్టడీకి కోరనున్నట్లు సీఐ విద్యాసాగర్ తెలిపారు. చోరీ కేసు చేధనలో తీవ్రంగా శ్రమించిన డి.సుబ్రహ్మణ్యం, ఎస్.బ్లేసమ్, పి.గంగాధర్, కె,రాంబాబు, బి.నెహ్రూ, బి.శ్రీనివాసరావు, కేవీవీ రవికుమార్, వి.చిట్టిబాబును సీఐ విద్యాసాగర్ అభినందించారు.

కమనీయం.. బ్రహ్మోత్సవం



స్వామి, అమ్మవార్లకు అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

- వైభవంగా వాడపల్లి వెంకన్న బ్రహ్మోత్సవాలు
- తరలివచ్చిన భక్తులు

ఆత్రేయపురం: వాడపల్లిలోని శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాలు మంగళవారం వైభవంగా కొనసాగాయి. వేద పండితుల మంత్రోచ్ఛారణ మధ్య భక్తజన కోటి తన్మయత్వంతో వేడుకలను తిలకించింది. దేవదాయ ధర్మదాయశాఖ డిప్యూటీ కమిషనర్, ఆలయ ఈఓ నల్లం సూర్యచక్రధరరావు దంపతులు స్వామికి పట్టువస్త్రాలను సమర్పించారు. సరస్వతి అలంకరణలో హంస వాహనంపై స్వామిని ప్రత్యేకంగా అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. ఉదయం నుంచి పూజలు, హోమాలు జరిపారు. భద్రాచలంలోని సీతారామస్వామి ఉత్సవ మూర్తులను ఆలయానికి తీసుకుని వచ్చి ప్రత్యేక పూజలు చేశారు. ఖండవల్లి రాజేశ్వర వరప్రసాదాచార్యులు ఆధ్వర్యంలో వేదపండితులు, అర్చకులు పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. ఆలయ ఈఓ చక్రధరరావు ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఎస్సై రాము ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



స్వామి వారికి పట్టు వస్త్రాలను సమర్పిస్తున్న ఆలయ ఈఓ దంపతులు



ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు